ఈనాడు
రాజన్న సిరిసిల్ల
బుధవారం అక్టోబరు 9, 2024

హాతవిధీ.. రక్తనిధి

వేములవాడ ఆసుపత్రిలో శస్త్రచికిత్సలకు రోగుల అవస్థలు

ఈనాడు, సిరిసిల్ల

జిల్లాలోని వేములవాడ ప్రాంతీయ ఆసుపత్రికి రక్తనిల్వ కేంద్రం ఉత్తర్వులకే పరిమితమైంది. రెడ్‌క్రాస్ సొసైటీతో కలిసి ఏర్పాటు చేయాల్సి ఉంది. రక్తనిల్వ కేంద్రం ఏర్పాటైతే.. అత్యవసర పరిస్థితుల్లో రక్తం అందుబాటులో ఉంటుంది. జిల్లా అంతటికీ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలోని రక్తనిధి కేంద్రంపైనే ఆధారపడాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. ఇప్పటికే పనులు ప్రారంభం కావాల్సి ఉండగా మూడు నెలలుగా ఆ ప్రక్రియ ముందుకు సాగడం లేదు.

జిల్లా ఆసుపత్రి వైద్య కళాశాల స్థాయికి పెరగడంతో దీనిలోని రక్తనిల్వ కేంద్రం రక్తనిధిగా మారింది. అప్పుడే వేములవాడలోనూ ప్రాంతీయ ఆసుపత్రి నూతన భవనం కూడా ప్రారంభమైంది. జిల్లా జనరల్ ఆసుపత్రిలోని రక్త నిల్వ చేసే సామగ్రిని వేములవాడకు తరలిస్తే ఇబ్బంది ఉండేది కాదు.

● వేములవాడ ప్రాంతీయ ఆసుపత్రిలో ప్రసవాల్లో శస్త్రచికిత్సలు, జనరల్ సర్జన్లు నిత్యం జరుగుతున్నాయి. అదే విధంగా ప్రమాదాల బారిన పడిన వారికి అత్యవసర చికిత్సలు కూడా అందుతున్నాయి. ఇలా నెలకు సగటున 120 యూనిట్లు పైగా రక్తం అవసరమవుతుంది. రక్తనిల్వ కేంద్రం లేకపోవడంతో జిల్లా ఆసుపత్రికి పరుగు తీయాల్సి ఉంటుంది. అంతేకాకుండా జిల్లాలో ఎక్కడ అవసరమున్నా జిల్లా జనరల్ ఆసుపత్రికి రావాల్సిందే.


సిరిసిల్ల: రక్తనిధిలోని నిల్వలు

నెల	నిల్వ	శిబిరాలు	సేకరించిన యూనిట్లు	పంపిణీ చేసినవి
జులై	102	03	129	138
ఆగస్టు	89	-	102	119
సెప్టెంబరు	63	02	139	115

వేములవాడ ఆసుపత్రిలో శస్త్రచికిత్సలు

నెల	సిజేరియన్‌లు	ఇతర శస్త్రచికిత్సలు
జులై	46	116
ఆగస్టు	37	86
సెప్టెంబరు	43	119

సేకరణ ఇలా...

జిల్లా ఆసుపత్రిలోని రక్తనిధి కేంద్రం ఆధ్వర్యంలో ప్రతి నెలా రక్తదాన శిబిరాలను నిర్వహిస్తూ దాతల నుంచి రక్తాన్ని సేకరిస్తున్నారు. వేములవాడ ఆసుపత్రిలో రక్త నిల్వ కేంద్రం అందుబాటులోకి వస్తే జిల్లా ఆసుపత్రి నుంచి అవసరాన్ని బట్టి ముందస్తుగా నిల్వ చేసుకునే వీలుంటుంది. అత్యవసర శస్త్రచికిత్సల సమయంలో అక్కడే నిర్ధారణ పరీక్షలు చేసుకుని రోగులకు అందించవచ్చు.

త్వరలో పనులు ప్రారంభం

ఆసుపత్రిలో శస్త్రచికిత్సలు పెరుగుతున్నాయి. రక్తనిల్వ కేంద్రం అవసరం ఉంది. ఇటీవలే ఆసుపత్రిలోని పలు గదులను పరిశీలించారు. వాటిలో రక్తనిల్వ కేంద్రానికి అనుగుణంగా మార్పులు చేర్పులకు ఉన్నతాధికారుల నుంచి అనుమతి రావాల్సి ఉంది. దాని తర్వాత పనులు ప్రారంభిస్తారు. **- సంతోష్, పర్యవేక్షకుడు, వేములవాడ ప్రాంతీయ ఆసుపత్రి**



రూ. 5,00,116 నోట్లతో అలంకరణ

సిరిసిల్ల(విద్యానగర్), న్యూస్‌టుడే: సిరిసిల్లలో శరన్నవరాత్రుల ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఈ సందర్భంగా అమ్మవారు మంగళవారం మహాలక్ష్మి అవతారంలో దర్శనమిచ్చారు. సిరిసిల్లలో జగదంబ సేవా సమితి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారిని రూ.5,00,116 నోట్లతో అలంకరించారు. ఈ కార్యక్రమంలో యెల్లె లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

క్రీడా నైపుణ్యం పెంచేందుకు ప్రభుత్వం కృషి

సిరిసిల్ల గ్రామీణం, న్యూస్‌టుడే: యువతకు క్రీడలపై ఆసక్తి, నైపుణ్యం పెంపొందించేందుకు ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేసిందని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు. మంగళవారం సిరిసిల్ల పట్టణంలో సీఎం కప్ టార్చ్ ర్యాలీని కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా, ఎస్పీ అఖిల్ మహాజన్‌లతో కలిసి ఆయన ప్రారంభించారు. అంబేడ్కర్ చౌరస్తా నుంచి గాంధీ చౌరస్తా వరకు ర్యాలీ సాగింది. అనంతరం విప్ మాట్లాడుతూ యువత జాతీయ, అంతర్జాతీయ క్రీడల్లో రాణించి, పతకాలు సాధించేలా శిక్షణ ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిందని తెలిపారు. ఒలింపిక్స్‌లో పతకాలు సాధించేలా శిక్షణ ఇప్పించేందుకు హైదరాబాద్ గచ్చిబౌలిలో సౌకర్యాలు కల్పించేందుకు ప్రణాళికలు చేసినట్లు తెలిపారు. క్రీడల్లో ఉత్తమ ప్రతిభ చూపే క్రీడాకారులకు రాష్ట్ర ప్రభుత్వం గ్రూప్-1 స్థాయి ఉద్యోగాలు కల్పిస్తుందని చెప్పారు. వేములవాడలో క్రీడా మైదానం పనులు పూర్తి చేసేందుకు అన్ని చర్యలు తీసుకొంటుందని పేర్కొన్నారు. తను ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత అన్ని మండల కేంద్రాల్లో ఓపెన్ జిమ్‌ల ఏర్పాటుకు నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. క్రమంగా అన్ని గ్రామాల్లో ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారు. యువత పెడదారి పట్టకుండా గంజాయి రహిత సమాజ నిర్మాణంలో భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ జిందం కళ, జిల్లా క్రీడాశాఖ అధికారి ఎ.రాందాస్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, యువతీ, యువకులు తదితరులు పాల్గొన్నారు.



క్రీడా జ్యోతిని వెలిగించి ర్యాలీలో పాల్గొన్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా, ఎస్పీ అఖిల్ మహాజన్, కాంగ్రెస్ నాయకులు

మదినిండుగా... పూల పండగ

వేములవాడలో బతుకమ్మ సంబరాలు


బెలూన్లు ఎగురవేస్తున్న బండి సంజయ్

బతుకమ్మ తెప్ప వద్ద బెలూన్లు ఎగురవేస్తున్న విప్ ఆది శ్రీనివాస్, ఛైర్‌పర్సన్ మాధవి, కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా, ఎస్పీ అఖిల్ మహాజన్, ఏఎస్పీ శేషాద్రినిరెడ్డి

జన సంద్రంగా మారిన మూలవాగు

బతుకమ్మతో యువతులు

వేములవాడ, న్యూస్‌టుడే: తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు అద్దం పట్టే సద్దుల బతుకమ్మ వేడుకలు మంగళవారం వేములవాడ పట్టణం, విలీన గ్రామాల్లో అంబరాన్నంటాయి. మహిళలు మూలవాగులోని బతుకమ్మ తెప్ప వద్ద ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన మైదానానికి చేరుకుని బతుకమ్మ ఆడారు. మహిళలు, ప్రజలతో జన సంద్రంగా మారింది. బెలూన్లను ఎగువేసి వేడుకలను ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ప్రారంభించారు. అనంతరం కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ భాజపా నాయకులతో కలిసి వచ్చి బెలూన్లు ఎగుర వేశారు. కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ మాధవి, కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా, ఎస్పీ అఖిల్ మహాజన్, ఏఎస్పీ శేషాద్రిని రెడ్డి, భాజపా జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ, ఇన్‌ఛార్జి కమిషనర్ సంపత్‌రెడ్డి, అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య అధ్యక్షురాలు విమలక్క తదితరులు పాల్గొన్నారు.


మూలవాగులో బతుకమ్మ ఆడుతున్న మహిళలు


నిమజ్జనం చేస్తూ...

సైబర్ మోసం.. కొత్త రూపం

అధికారులమని బెదిరిస్తూ డబ్బు స్వాహా

న్యూస్‌టుడే, గోదావరిఖని

'లింకు క్లిక్ చేస్తే డబ్బులు మాయం.. కొత్త యాప్‌లు తెరిస్తే ఖాతా నుంచి డబ్బు బదిలీ.. 'వ్యాపారంలో పెట్టుబడి పెట్టండి.. రెండింతల ఆదాయం పొందండి' అంటూ ప్రచారంతో మోసం.. 'మీ చరవాణి నంబర్ లక్కీ డ్రాకు ఎంపికైంది కొంత డబ్బు చెల్లిస్తే బంగారు ఆభరణం మీ చేతికి వస్తుంది' అంటూ దగా..'

ఇలా సైబర్ నేరగాళ్లు పలు రకాల మోసాలతో అమాయకులను గతంలో బురిడీ కొట్టించారు.. పాత నేరాలపై అవగాహన పెరిగి జనం జాగ్రత్త పడుతుండటంతో కొత్త రూపాలెత్తుతున్నారు.. తాజాగా పోలీసుల అవతారమెత్తి మోసాలకు పాల్పడుతున్నారు. ఈ ఏడాది ఇప్పటి వరకు ఉమ్మడి జిల్లాలో రూ.15.82 కోట్లను సైబర్ నేరగాళ్లు బాధితుల నుంచి కొల్లగొట్టారు. కొత్త కొత్త రూపాల్లో వస్తున్న సైబర్ నేరగాళ్ల పట్ల అప్రమత్తంగా ఉంటేనే సొమ్ము భద్రంగా ఉంటుంది. ఏ మాత్రం నిర్లక్ష్యం ప్రదర్శించినా డబ్బు క్షణాల్లో వారి చేతుల్లోకి వెళ్లే అవకాశం ఉంది.


ఉమ్మడి జిల్లాలో ఈ ఏడాది ఇప్పటివరకు..

నమోదైన కేసులు : **1,788**

సైబర్ నేరగాళ్లకు బదిలీ అయిన డబ్బు : రూ. **19,29,51,036**

సకాలంలో స్పందించడంతో బదిలీ కాకుండా ఆపగలిగింది : రూ. **3,46,81,599**

మోసం ద్వారా జనం నష్టపోయిన మొత్తం : రూ. **15,82,69,437**



డబ్బు పోయిందా.. తిరిగి రాదు

గుర్తు తెలియని వ్యక్తి బెదిరించగానే చెప్పిన ఖాతాకు డబ్బులు పంపిస్తున్నారు. ఒక్కసారి డబ్బు వారి ఖాతాలోకి చేరిందంటే తిరిగి రావడమంటూ ఉండదు. ఒకవేళ మోసపోయినా గంటలోపు గుర్తించి 1930కు సమాచారం అందిస్తే 90 శాతం సొమ్మును బదిలీ కాకుండా సైబర్ క్రైం పోలీసులు ఆపగలుగుతారు. ఆలస్యమైన కొద్దీ నిలువరించే శాతం తగ్గుతుంది.

ఉమ్మడి జిల్లాలో తాజా మోసాలిలా

● నీ మీద మనీ లాండరింగ్ కేసు నమోదైంది. మేము ముంబయి పోలీసులం. కేసు లేకుండా ఉండాలంటే మేము చెప్పిన బ్యాంకు ఖాతాలో డబ్బు జమ చేయాలి.

● మేము సీబీఐ ఆఫీసు నుంచి మాట్లాడుతున్నాం. మీపై కేసు నమోదైంది. అరెస్టు చేయకుండా ఉండాలంటే చెప్పిన బ్యాంకు ఖాతాలో డబ్బు వేయాలి. లేదంటే విచారణ కోసం సీబీఐ కార్యాలయానికి తీసుకెళ్తాం.

● దిల్లీ పోలీసులం మాట్లాడుతున్నాం. గంజాయి రవాణా చేస్తుండగా మీ అబ్బాయి పట్టుబడ్డాడు. వెంటనే డబ్బు పంపిస్తే వదిలేస్తాం.

● అక్రమ లావాదేవీలపై విచారణ చేస్తున్నాం. అందులో మీ ప్రమేయమున్నట్లు అనుమానం ఉంది. విచారణ కోసం సెక్యూరిటీ డిపాజిట్ చేయాలి. అందులో మీ ప్రమేయం లేదని తేలితే డబ్బు తిరిగిచ్చేస్తాం.

అప్రమత్తతే శ్రీరామరక్ష

● చరవాణిలకు వచ్చే తెలియని లింకులను తెరవకూడదు.

● గుర్తు తెలియని వ్యక్తి ఫోన్ చేసి బెదిరించినా స్పందించకూడదు. పోలీసులకు సమాచారం ఇవ్వాలి.

● రుణాలు మంజూరయ్యాయంటే నమ్మకూడదు. అలాంటి యాప్‌ల జోలికి వెళ్లకూడదు.

● పోలీసులమని ఫోన్ చేసే వ్యక్తుల మాటలను నమ్మకండి. వారు సరైనవారా కాదా అని నిర్ధారించుకోండి. అవసరమైతే మీ పరిధిలో ఉన్న పోలీసులకు తెలియజేయండి.

● ఆన్‌లైన్ వ్యాపారం పేరుతో కూడా సైబర్ నేరగాళ్లు యాప్‌లను పంపిస్తుంటారు. పెట్టుబడి పెడితే రెండింతలవుతుందని నమ్మిస్తారు. వీటిపై కూడా జాగ్రత్తగా ఉండాలి.

ప్రజల సహకారం అవసరం

సైబర్ మోసాలపై ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. అయినా ప్రజలు మోసగాళ్ల వలలో పడుతున్నారు. కొత్త కొత్త రూపాల్లో సైబర్ నేరగాళ్లు వస్తున్నారు. అప్రమత్తతతో గుర్తించాలి.

- వెంకటరమణ, రామగుండం సైబర్‌క్రైం ఏసీపీ

డీఎస్సీ ఫలితాలు వెల్లడి

సిరిసిల్ల(విద్యానగర్), న్యూస్‌టుడే: డీఎస్సీ ఫలితాలను ప్రభుత్వం మంగళవారం విడుదల చేసింది. ఈ సందర్భంగా జిల్లాలో మొత్తం 151 పోస్టులకు గాను 130 మందిని ఎంపిక చేశారు. వీరి వివరాలను జిల్లా విద్యాశాఖ వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేశారు. ఇంకా ఇద్దరి ధ్రువపత్రాల పరిశీలన పెండింగ్‌లో ఉన్నట్లు విద్యాశాఖ అధికారులు తెలిపారు. వారివి పూర్తయిన తరవాత తుది జాబితా విడుదల అవుతుందని పేర్కొన్నారు. ఈ నెల 4న 1:3 నిష్పత్తిలో ఎంపికైన 450 మంది అభ్యర్థుల వివరాలను వెబ్‌సైట్‌లో పెట్టారు. సిరిసిల్లలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ధ్రువపత్రాలను పరిశీలించారు.

నెమలి వాహనంపై స్వామివార్ల ఊరేగింపు

వేములవాడ, న్యూస్‌టుడే: శ్రీరాజరాజేశ్వరస్వామి ఆలయంలో శ్రీ దేవీ నవరాత్రోత్సవాల్లో భాగంగా మంగళవారం రాత్రి స్వామివార్లు నెమలి వాహనంపై విహరించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారు కాత్యాయని అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. రాత్రి శ్రీ రాజరాజేశ్వరస్వామి, శ్రీలక్ష్మీ సమేత అనంత పద్మనాభస్వామివార్ల ఉత్సవమూర్తులకు ఆలయ వేద పండితులు, అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం అందంగా అలంకరించిన పెద్ద సేవ నిర్వహించారు. నెమలి వాహనంపై ప్రతిష్ఠించి స్వామివార్లను పట్టణంలోని ప్రధాన వీధుల్లో ఊరేగించారు. ఈ సందర్భంగా పెద్ద ఎత్తున భక్తులు స్వామివార్లను దర్శించుకొన్నారు.


కాత్యాయని అలంకారంలో అమ్మవారు

పత్తి కొనుగోలుకు ప్రణాళికాబద్ధంగా చర్యలు

సిరిసిల్ల కలెక్టరేట్, న్యూస్‌టుడే: వానాకాలం సీజన్‌లో వచ్చే పత్తిపంటను మద్దతు ధరపై కొనుగోలు చేసేందుకు ప్రణాళికాబద్ధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా పేర్కొన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో పత్తి కొనుగోలుపై సంబంధిత అధికారులతో సమీక్షాసమావేశం నిర్వహించారు. పత్తి కొనుగోలుకు కార్యాచరణ ప్రణాళికను అధికారులు జిల్లా కలెక్టర్‌కు వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పత్తి పంటకు మద్దతు ధర అందేలా చూసేందుకు జిల్లా స్థాయిలో కలెక్టర్ అధ్యక్షతన ప్రభుత్వం జిల్లా స్థాయి కమిటీ నియమించిందని తెలిపారు. మార్కెట్‌లో నాణ్యమైన పత్తి పంటకు ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర కంటే తక్కువ ధర పలికితే వెంటనే సీసీఐ కేంద్రాల ద్వారా మద్దతు ధర కల్పించాల్సి ఉంటుందని తెలిపారు. జిల్లాలో 42,390 ఎకరాల్లో పత్తి సాగు చేశారని, 30 వేల మెట్రిక్ టన్నుల పత్తి దిగుబడి వస్తుందని అంచనా వేసినట్లు తెలిపారు. జిల్లాలో 5 జిన్నింగ్ మిల్లుల్లో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. రైతుల బ్యాంకు ఖాతాలకు ఆధార్‌కార్డుతో లింగ్ చేయాలని, దీనిపై వ్యవసాయశాఖ అధికారులు అవగాహన కల్పించాలన్నారు. పొడవు గింజ పత్తికి క్వింటాల్‌కు రూ.7521 మద్దతు ధర ప్రకటించామని తెలిపారు. పత్తి తేమశాతం 8 నుంచి 12 శాతం మధ్యలో ఉండే విధంగా చూసుకోవాలని పేర్కొన్నారు. కొనుగోలు చేసిన 48 గంటలలోగా రైతులకు చెల్లింపులు చేయాలని ఆదేశించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్, అదనపు ఎస్పీ చంద్రయ్య, జిల్లా వ్యవసాయ అధికారి అఫ్జల్ బేగం, తూనికలు, కొలతలు అధికారి రూపేష్ కుమార్, సెస్ ఎండీ శ్రీనివాసరెడ్డి, జిల్లా మార్కెటింగ్ అధికారి ప్రకాశ్, జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి వసంతలక్ష్మి, డీఎం రజిత, సీసీఐ అధికారి శక్తివేల్, వ్యవసాయ మార్కెట్ కమిటీల కార్యదర్శులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా

స్వామివారికి అలంకరణ సామగ్రి అందజేత

వేములవాడ, న్యూస్‌టుడే: హైదరాబాద్‌కు చెందిన వట్టెంల రమేశ్, కరుణ కుటుంబ సభ్యులు మంగళవారం రాజన్నను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం స్వామివారికి దాదాపు రూ. 4 లక్షల విలువ చేసే పుష్పాలంకరణ సామగ్రిని అందజేశారు. ఆలయ పర్యవేక్షకుడు తిరుపతిరావు వారికి స్వామివారి కండువా కప్పి ప్రసాదం అందజేశారు.

విశ్వవ్యాప్తం.. బతుకమ్మ సంబరం

తీరొక్క పూలతో సంస్కృతీ సంప్రదాయాలను పూయిస్తున్న బతుకమ్మ.. కొన్నేళ్లుగా విశ్వవ్యాప్తంగా సందడి చేస్తోంది. మన పండగ అనే భావనతో వివిధ దేశాల్లో స్థిరపడిన వారంతా పోటీపడి వేడుకలు నిర్వహిస్తున్నారు. చిన్నాపెద్దా తేడా లేకుండా కార్యక్రమాల్లో పాల్గొంటుండగా ఆసక్తికరమైన పోటీలు నిర్వహిస్తూ ఈ పండగకు నిర్వాహకులు వన్నె తెస్తున్నారు. రాష్ట్రం నుంచి రాజకీయ నాయకులు, సినీతారలు, బుల్లితెర నటులు, ఆయా దేశాల్లోని భారత రాయబార కార్యాలయాల అధికారులు, వివిధ దేశాల ప్రజాప్రతినిధులు బతుకమ్మ వేడుకల్లో పాల్గొంటున్నారు.
న్యూస్‌టుడే, మేడిపల్లి



ఎడారి దేశాల్లో పూల సందడి

గల్ఫ్ దేశాల్లో బతుకమ్మ వేడుకలకు విశేష స్పందన వస్తోంది. ఉమ్మడి జిల్లా నుంచి ఆయా దేశాలకు వెళ్లిన వారికి ఈ వేడుకలు ఆనందాన్నిస్తున్నాయి. దుబాయిలో గల్ఫ్ తెలంగాణ వెల్ఫేర్ అండ్ కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 17 ఏళ్లుగా వేడుకలు నిర్వహిస్తున్నారు. ఎమిరేట్స్ తెలంగాణ కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అక్టోబరు 6న.. ఇండియన్ పీపుల్స్ ఫోరం ఆధ్వర్యంలో అక్టోబరు 5న సంబరాలు జరిపారు. గల్ఫ్ తెలంగాణ వెల్ఫేర్ అండ్ కల్చరల్ అసోసియేషన్‌లో చందుర్తి మండలం నర్సింగాపూర్‌కు చెందిన జువ్వాడి శ్రీనివాస్‌రావు, మంథనికి చెందిన శ్రీనివాస్ శర్మ, జగిత్యాలకు చెందిన మెట్ట రమేశ్‌చంద్ర, సలావుద్దీన్, మేడిపల్లికి చెందిన దామెర సామ్యూల్ పండగ ఏర్పాట్లు పర్యవేక్షించారు. ఎమిరేట్స్ తెలంగాణ కల్చరల్ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు పీచర కిరణ్‌కుమార్ బోయినపల్లి మండలం వర్దవెల్లికి చెందిన వారు కాగా ప్రస్తుత అధ్యక్షుడు రాధారపు సత్యం సిరిసిల్ల వాస్తవ్యులు. ఇండియన్ పీపుల్స్ ఫోరంలో మేడిపల్లి మండలం తొంబర్రావుపేటకు చెందిన గంగారాం సభ్యుడిగా ఉన్నారు. దుబాయి సహా బహ్రెయిన్, కువైట్, ఒమన్, ఖతర్ తదితర గల్ఫ్ దేశాల్లోనూ పూల పండగను ఘనంగా నిర్వహిస్తున్నారు.


దుబాయిలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు

అంబరాన్నంటేలా..

అమెరికాలో గ్లోబల్ తెలంగాణ అసోసియేషన్ ఆధ్వర్యంలో అక్టోబరు 5న వైభవంగా పండగ జరిపారు. పెద్దపల్లికి చెందిన విశ్వేశ్వర్‌రెడ్డి కల్వల ఈ సంఘానికి అధ్యక్షుడిగా ఉన్నారు. న్యూవింగ్టన్‌లో ఈ నెల 6న తెలంగాణ ఎన్నారై అసోసియేషన్ ఆధ్వర్యంలో వేడుకలు జరగగా.. డల్లాస్, చికాగోలోనూ కార్యక్రమాలు నిర్వహించారు. న్యూజెర్సీలో తెలంగాణ డెవలప్‌మెంట్ ఫోరం ఆధ్వర్యంలో 20వ సారి.. ఫ్లోరిడాలోని టాంపా నగరంలో తెలంగాణ అమెరికన్ తెలుగు అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 6న వేడుకలు జరిగాయి. అమెరికాతోపాటు ఆస్ట్రేలియా, న్యూజిలాండ్, సింగపూర్, మలేషియా, యూకే తదితర దేశాల్లో కొన్ని ప్రాంతాల్లో వేడుకలు పూర్తి కాగా మరి కొన్ని ప్రాంతాల్లో జరగనున్నాయి.


అమెరికాలో వేడుకలకు హాజరైన అతివలు

వేడుకలకు అతిథులు

దుబాయిలో జరిగిన వేడుకలకు మంత్రి జూపల్లి క్రిష్ణారావు, నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ తదితరులు హాజరయ్యారు. సినీనటి అనన్య, జానపద గాయని వరం, బుల్లితెర హాస్యనటుడు సదన్న, భారత రాయబార కార్యాలయం నుంచి బిజేందర్ సింగ్ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అమెరికాలో వేడుకలకు మంత్రి జూపల్లి క్రిష్ణారావు హాజరయ్యారు. అమెరికా సహా వివిధ దేశాలకు తెలంగాణకు చెందిన పలువురు సినీనటులు, బుల్లితెర నటులు, వ్యాఖ్యాతలు, గాయనీ గాయకులు, సినీ ప్రముఖులు హాజరవుతూ బతుకమ్మ వేడుకలకు వన్నె తెస్తున్నారు.

ఊరిలో ఉన్నట్టుగానే ఉంది



ఈటీసీఏ ఆధ్వర్యంలో ఏటా బతుకమ్మ వేడుకలు నిర్వహిస్తున్నాం. మహిళా విభాగం ఈ వేడుకల నిర్వహణలో చురుకుగా పాల్గొంటోంది. ఈసారి వేడుకలకు 5 వేల మంది వరకు హాజరయ్యారు. ఇక్కడి వాతావరణం చూస్తుంటే మా గ్రామంలో ఉన్నట్లే అనిపిస్తోంది. ఆటపాటలతో మహిళలు, చిన్నారుల సందడి పండగకు వన్నె తెచ్చింది. ఏటా ఇలాగే కార్యక్రమాలు నిర్వహించాలని ఈటీసీఏ భావిస్తోంది. **- రాణి కోట్ల, దుబాయి**

ఆకట్టుకున్న పండగ



దుబాయిలో బతుకమ్మ వేడుకలు ఆకట్టుకున్నాయి. ఉద్యోగరీత్యా వివిధ ప్రాంతాల్లో స్థిరపడిన వారంతా కుటుంబ సభ్యులతో వేడుకల్లో పాల్గొన్నారు. దసరా ముందర ఈ పండగ అందరిలో హుషారు నింపింది. ఎడారి దీవుల పక్కన పూలతో చేసుకునే పండగ ఇక్కడి వారు కూడా ఆస్వాదించారు. రాష్ట్రం నుంచి వచ్చిన పలువురు వారి ప్రదర్శనలతో ఆకట్టుకున్నారు. **- మౌనిక గుండవేని, దుబాయి**

ఐరావతంపై నారసింహుడి ఊరేగింపు



ధర్మపురి, న్యూస్‌టుడే: పట్టణంలోని శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మంగళవారం రాత్రి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఐరావతం (ఏనుగు)పై ఉత్సవ మూర్తులను ఆసీనులను చేసి ప్రత్యేకంగా పూజలు నిర్వహించారు. అనంతరం దేవస్థానం నుంచి సేవను పుర వీధుల్లో స్వామివారి శోభాయాత్ర ఘనంగా ఊరేగించారు. ఈవో శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.

సొంతానికి ఎక్కువ.. ఆర్థికాభ్యున్నతికి తక్కువ

మహిళా రుణాల వినియోగం తీరిది ● నెరవేరని ప్రభుత్వ లక్ష్యం

న్యూస్‌టుడే, కరీంనగర్ సంక్షేమ విభాగం

మహిళలు ఆర్థికంగా ఎదగడానికి జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులు బ్యాంకు లింకేజీతో రుణాలు అందజేస్తున్నారు. గతేడాది విధించిన లక్ష్యం చేరుకోవడంతో.. రాష్ట్రస్థాయిలో అవార్డు సైతం సొంతం చేసుకున్నారు. ప్రస్తుతం 2024-25 లక్ష్యాన్ని నిర్దేశించుకున్నారు. రుణాలు తీసుకున్న వారిలో అతికొద్ది మాత్రమే వ్యాపారానికి ఉపయోగించుకొని ఆర్థికాభ్యున్నతి పొందుతున్నారు. ఎక్కువ శాతం మంది సొంత అవసరాలకే వినియోగిస్తున్నారు. వారిలో అవగాహన పెంచాల్సిన ఆవశ్యకతపై 'న్యూస్‌టుడే' కథనం.

ఉమ్మడి కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా స్వయం సహాయక సంఘాలకు ఏటా మంజూరు చేసిన రుణాన్ని.. సొంతానికి వినియోగించుకున్న అప్పులు చెల్లించడం, ఇతరాత్ర వాటికే మహిళలు ఉపయోగించుకుంటున్నారు. సొంతంగా ఏదైనా స్వయం ఉపాధి ఏర్పాటు చేసుకొని ఆర్థికంగా ఎదిగేందుకు ఆలోచన చేయడంలేదు. అతి కొద్దిమంది మాత్రమే చిన్నపాటి వ్యాపారాలు చేస్తున్నారు. దీంతో మహిళలు పురోగతి సాధించాలనే ప్రభుత్వ లక్ష్యం నీరుగారుతోంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి మంజూరు చేసిన రుణమొత్తానికి ఆర్థికంగా ఎదిగేలా ప్రోత్సహిస్తే బాగుంటుందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

జిల్లాల వారీగా ఈ ఆర్థిక సంవత్సరం వివరాలు

జిల్లా	సంఘాలు	రుణ లక్ష్యం (రూ.లక్షల్లో)
కరీంనగర్	11,083	77,125.34
రాజన్న సిరిసిల్ల	8,007	53,319.00
పెద్దపల్లి	9,101	47,796.95
జగిత్యాల	12,636	76,563.63



అవగాహన అవసరం

మహిళలు ఆర్థికంగా నిలదొక్కుకొని వ్యాపారాలు చేయాలనే ఉద్దేశంతో ప్రభుత్వం రుణాలు మంజూరు చేస్తోంది. వారందరూ రుణాలు తీసుకునేలా ఏటా లక్ష్యాన్ని విధిస్తోంది. అధికారులు ఉమ్మడి కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా నాలుగు లక్షలకుపైగా సభ్యురాళ్లకు రుణాలు మంజూరు చేస్తే.. అందులో కనీసం వందల్లో కూడా ఆర్థికంగా రాణిస్తున్న వారు లేకపోవడం విశేషం. ప్రస్తుతం పలు సంఘాలు ఏటా రూ.3 లక్షల నుంచి రూ.20 లక్షల వరకు రుణం తీసుకుంటున్నాయి.

ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాం

మహిళలు ఆర్థికాభ్యున్నతి సాధించడానికి ప్రస్తుతం ఇందిరా మహిళా శక్తి ద్వారా సొంతంగా వ్యాపారాలు నిర్వహించేలా తగిన ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాం. వ్యాపారాలు ప్రారంభించి లాభాన్ని అర్జించేలా అధికారులు సూచనలు చేస్తూ పర్యవేక్షించేలా చూస్తాం.
- శ్రీధర్, కరీంనగర్ జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి

ఆధ్యాత్మిక పర్యాటకం.. అభివృద్ధికి అవకాశం

ఉమ్మడి జిల్లాలో సర్క్యూట్ ఏర్పాటుకు సన్నాహాలు

న్యూస్‌టుడే, ధర్మపురి

పర్యాటక, దేవాదాయశాఖల ఆధ్వర్యంలో రాష్ట్రంలో మూడు సర్క్యూట్లను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. దీంతో ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని వేములవాడ, కొండగట్టు, ధర్మపురి, కోటిలింగాల్లో ఆధ్యాత్మికతను వెదజల్లుతూనే.. పర్యాటకంగా భక్తులను ఆకర్షించాలన్న లక్ష్యంతో ప్రభుత్వం అడుగులు వేస్తోంది. దీంతో ఈ కేంద్రాలు మరింత అభివృద్ధి చెందుతాయని భావిస్తున్నారు.


ధర్మపురి దేవస్థానం

● **చరిత్రాత్మక ఆలయాలు..**

☛ జగిత్యాల జిల్లాలోని చారిత్రక ప్రాధాన్యత కలిగి శాతవాహనుల రాజధానిగా వెలుగొందిన కోటిలింగాలలోని కోటి లింగేశ్వరస్వామి ఆలయం భక్తులను ఆకర్షిస్తోంది. తెలుగు రాష్ట్రాల్లోని తొమ్మిది నృసింహ క్షేత్రాల్లో ఒకటిగా పూజలందుకున్న ధర్మపురి క్షేత్రం.. భక్తుల కొంగు బంగారమైంది.

☛ జిల్లా సరిహద్దున గల రాయపట్నం వద్ద పురాతన, నూతన వారధుల ప్రదేశం, ఎల్లంపల్లి నిలువ నీటి ప్రదేశాలు భక్తులను ఆకర్షిస్తున్నాయి. ఇప్పటికే వెల్గటూర్ మండలంలోని కోటిలింగాల వద్ద ఏర్పాటుచేసిన బోటింగు పర్యాటకులను విశేషంగా ఆకట్టుకుంటుంది.

☛ ప్రముఖ శైవ క్షేత్రాల్లో ఒకటిగా వెలుగొందుతున్న వేములవాడ శ్రీ రాజరాజేశ్వరస్వామి ఆలయం దక్షిణ కాశీగా చారిత్రాత్మక ప్రాధాన్యతను పొంది, భక్తులకు పెన్నిధిగా మారింది. లక్షలాది మంది హనుమాన్ భక్తులతో నిండిన కొండగట్టు ఆంజనేయస్వామి ఆలయం విశేష ప్రాచుర్యాన్ని పొందింది.

● **ప్రణాళికల రూపకల్పన..**

గత నెలలో దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ, ఆ శాఖ ప్రధాన కార్యదర్శి శైలజా రామయ్యర్, కమిషనర్ హన్మంతరావులతోపాటు, దేవస్థానాలకు చెందిన అధికారులు సమావేశమయ్యారు. ఆలయాల్లో చేపట్టాల్సిన అభివృద్ధి పనులు, మాస్టర్ ప్లాన్లు, భక్తులకు వీఐపీ దర్శన సౌకర్యాల కల్పనలపై సుదీర్ఘంగా చర్చించారు. దేవస్థానాల్లో చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై, భక్తులకు వసతులతోపాటు, ఆయా కేంద్రాల్లో పర్యాటకపరంగా తీర్చిదిద్దేలా ప్రణాళికలను రూపొందిస్తున్నారు. ఈ కేంద్రాల్లో ఓ వైపు పర్యాటకపరంగా ఏఏ పనులు ఇంతకుముందు ప్రతిపాదించారు? ఇంకా ఏ పనులు చేపట్టాల్సి ఉంది? నిధులు ఎన్ని అవసరమవుతాయనే విషయంపై చర్చించనున్నారు.

☛ ఇంతటి ప్రాధాన్యతలు, విశేషాలు ఉన్న ప్రధాన ఆధ్యాత్మిక కేంద్రాలను కలిపి మొదటి సర్క్యూట్‌గా ఏర్పాటుచేసి, పర్యాటక, దేవాలయాల పరంగా అభివృద్ధి పరచే లక్ష్యంతో ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది.

ఎస్సారెస్పీకి 34 వేల క్యూసెక్కుల వరద

జగిత్యాల ధరూర్‌క్యాంపు, న్యూస్‌టుడే: శ్రీరామసాగర్ ప్రాజెక్టులోకి మంగళవారం సాయంత్రం వరకు 34,086 క్యూసెక్కుల వరదనీరు వస్తుండగా 4 స్పిల్‌వే గేట్ల ద్వారా 12,496 క్యూసెక్కులు, ఎస్కేప్ గేట్ల ద్వారా 1,200 క్యూసెక్కులు, మిగులు జలాలను గోదావరిలోకి విడుదల చేస్తున్నారు. వరద కాలువకు 12 వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తూ మధ్యమానేరు జలాశయానికి తరలిస్తున్నారు. కాకతీయ కాలువ, విద్యుత్తు ఉత్పత్తికి 6,800, లక్ష్మీ కాలువకు 150, సరస్వతి కాలువకు 500, మిషన్ భగీరథకు 231 క్యూసెక్కుల చొప్పున నీటిని విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టులో గరిష్ఠ స్థాయిలో 80.501 టీఎంసీల నీటినిల్వ, 1091.0 అడుగుల నీటిమట్టం ఉంది.

బడితండా వాసికి బంగారు పతకం


పతకంతో అనిల్

రుద్రంగి, న్యూస్‌టుడే: గోవాలో ఈ నెల 6 నుంచి 8 వరకు నిర్వహించిన ఆల్ ఇండియా యూత్ గేమ్స్ 800 మీటర్ల పరుగు పోటీలో రుద్రంగి మండలం బడితండాకు చెందిన మాలోత్ అనిల్ ప్రతిభ కనబరిచి బంగారు పతకం సాధించాడు. ఇటీవల జాతీయ స్థాయి ట్రెక్కింగ్ పోటీలకు కూడా అనిల్ ఎంపికయ్యాడు. ప్రస్తుతం అనిల్ కరీంనగర్‌లోని ఎస్ఆర్ఆర్ సైన్స్ అండ్ ఆర్ట్స్ కళాశాలలో బీకాం రెండో సంవత్సరం చదువుతున్నాడు. వివిధ క్రీడల్లో రాణిస్తున్న యువకుడిని మండలానికి చెందిన పలువురు అభినందించారు.

హత్యాయత్నం కేసులో రెండేళ్ల జైలు



జగిత్యాల, న్యూస్‌టుడే: హత్యాయత్నం కేసులో ఒకరికి జగిత్యాల న్యాయస్థానం రెండేళ్ల జైలు శిక్ష విధించింది. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం.. బుగ్గారం మండలం గోపులాపూర్‌లో రొండి మాణిక్యం అలియాస్ సంతోశ్.. తన అన్న రొండి రవీందర్ మధ్య తరచూ గొడవలు జరుగుతున్నాయి. రవీందర్ భార్య సుజాత మంత్రాలు చేయడం వల్లే తన భార్యాపిల్లల ఆరోగ్యం దెబ్బతింటుందని భావించి మాణిక్యం కోపం పెంచుకున్నాడు. 2018 ఫిబ్రవరి 21న కొబ్బరిబోండాలు కొట్టే కత్తితో రవీందర్ ఇంట్లోకి చొరబడిన మాణిక్యం.. తన వదిన సుజాతపై దాడి చేసి పారిపోయాడు. తీవ్రంగా గాయపడిన ఆమెను జగిత్యాల ఆసుపత్రికి తరలించారు. బుగ్గారం పోలీసులు కేసు నమోదు చేసి మాణిక్యంను రిమాండ్‌కు పంపించగా ఎస్సైలు మధుకర్, రవీందర్‌లు కేసు దర్యాప్తు చేశారు. కోర్టు విధుల అధికారులు రాజునాయక్, శ్రీధర్, కిరణ్‌లు సాక్ష్యాధారాలు అందించగా ప్రాసిక్యూషన్ తరఫున అదనపు పీపీ సాయిల్ల మురళి వాదించారు. నేరం రుజువు కావడంతో నిందితుడికి అసిస్టెంట్ సెషన్స్ జడ్జి కె.ప్రసాద్.. నిందితుడికి రెండేళ్ల జైలు శిక్ష, రూ.500 జరిమానా విధిస్తూ మంగళవారం తీర్పు చెప్పారు. శిక్ష పడటానికి చొరవ చూపిన అధికారులు, సిబ్బందిని జిల్లా ఎస్పీ అశోక్‌కుమార్ అభినందించారు.

మేయర్‌పై అట్రాసిటీ కేసు నమోదు

కరీంనగర్ నేరవార్తలు, న్యూస్‌టుడే: కరీంనగర్ నగర పాలక సంస్థ మేయర్ వై.సునీల్‌రావుపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు రెండో పట్టణ పోలీస్‌స్టేషన్ సీఐ విజయ్‌కుమార్ తెలిపారు. 44వ డివిజన్ కార్పొరేటర్ మెండి శ్రీలత ఫిర్యాదు ఆధారంగా కోర్టు ఆదేశాలతో పోలీసులు ఈ కేసును నమోదు చేశారు. తన డివిజన్‌లో జరగాల్సిన అభివృద్ధి పనులకు సంబంధించి నిధులు కేటాయించాలని గతంలో మేయర్‌ను క్యాంపు కార్యాలయంలో కలిసి విన్నవించానని.. ఆ సమయంలో కులం పేరుతో దూషించారని బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేశారు. డివిజన్‌కు దురుద్దేశపూర్వకంగానే నిధులు ఇవ్వడంలేదని రెండు సార్లు పోలీసు స్టేషన్‌లో కార్పొరేటర్ ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేయడంలో జాప్యం చేస్తున్నారని కోర్టును ఆశ్రయించారు. ఈ కేసులో వాస్తవాలని ధ్రువీకరించేందుకు పోలీసులు త్వరలో విచారణ చేపట్టనున్నారు.

గొలుసు చోరీ నిందితుల అరెస్టు



తెలంగాణచౌక్ (కరీంనగర్): గొలుసు దొంగతనాలకు (చైన్‌స్నాచింగ్) పాల్పడుతున్న నిందితులను పట్టుకున్నామని రూరల్ ఏసీపీ వెంకటరమణ తెలిపారు. ఏసీపీ తెలిపిన ప్రకారం.. ఎడవెల్లి దీపక్, చందు అనే యువకులు జల్సాలకు అలవాటుపడ్డారు. కరీంనగర్‌లోని పలు శివారు ప్రాంతాల్లో ఒంటరిగా నడిచి వెళ్లే మహిళలను లక్ష్యంగా చేసుకొని ద్విచక్రవాహనంపై వచ్చి బంగారు గొలుసులు చోరీ చేసేవారు. మంగళవారం తీగలగుట్టపల్లిలో పోలీసులు తనిఖీ చేస్తున్నారు. పోలీసులను చూసి పారిపోతుండగా వారిని పట్టుకున్నారు. నిందితుల నుంచి బంగారాన్ని కొన్న షాప్ యజమాని సింహరాజు నరేష్‌నూ అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి 105.85 గ్రాముల బంగారం రికవరీ చేశారు. స్కూటీతోపాటు బుల్లెట్ వాహనాన్ని స్వాధీనం చేసుకొని, నిందితులపై కేసు నమోదు చేశారు. నిందితులను పట్టుకోవడంలో కృషి చేసిన సీఐ ప్రదీప్‌కుమార్, ఎస్సై ఎ.లక్ష్మారెడ్డి, పోలీసు సిబ్బందిని ఏసీపీ అభినందించారు.

కాజీపేట నుంచి దాదర్‌కు రెండు ప్రత్యేక రైళ్లు



పెద్దపల్లి, న్యూస్‌టుడే: కాజీపేట, దాదర్ మధ్య నవంబరు నుంచి రెండు ప్రత్యేక రైళ్లను నడపనున్నట్లు దక్షిణ మధ్య రైల్వే అధికారులు తెలిపారు. మొదటి రైలు కాజీపేట నుంచి నవంబరు 27 నుంచి జనవరి 29 వరకు ప్రతి బుధవారం నడుస్తుంది. తిరిగి ఇదే రైలు దాదర్ నుంచి నవంబర్ 28 నుంచి జనవరి 30 వరకు ప్రతి గురువారం బయల్దేరుతుంది. రెండో ప్రత్యేక రైలు నవంబర్ 30 నుంచి జనవరి 25 వరకు ప్రతి శనివారం కాజీపేట నుంచి దాదర్‌కు, డిసెంబర్ 1 నుంచి జనవరి 26 వరకు ప్రతి ఆదివారం దాదర్ నుంచి నడుస్తుంది. రెండు రైళ్లు ఉమ్మడి జిల్లాలోని జమ్మికుంట, పెద్దపల్లి, కరీంనగర్, లింగంపల్లి(జగిత్యాల), కోరుట్ల, మెట్‌పల్లి స్టేషన్లలో ఆగుతాయి. ఇక్కడి నుంచి బాసర వెళ్లే భక్తులకు ఈ రైళ్లు అనుకూలంగా ఉంటాయి.

మార్కెట్‌కు నాలుగు రోజులు సెలవు

జమ్మికుంట, న్యూస్‌టుడే: జమ్మికుంట వ్యవసాయ మార్కెట్‌కు నాలుగు రోజులు సెలవు ప్రకటించామని ఉన్నతశ్రేణి కార్యదర్శి మల్లేశం తెలిపారు. పండగల అనంతరం సోమవారం మార్కెట్ నిర్వహణ ఉంటుందని రైతులు, వ్యాపారులు, కార్మికులు గమనించాలని ఆయన కోరారు.

తగ్గిన విక్రయాలు

మంగళవారం మార్కెట్‌లో కొత్తపత్తి విక్రయాలు తగ్గాయి. యార్డుకు 45 ట్రాలీల విడి పత్తి రాగా.. బిడ్డింగ్‌లో క్వింటాకు కనిష్ఠంగా రూ.6,000 గరిష్ఠంగా రూ.6,650 ధర పలికింది. 65 క్వింటాళ్ల బస్తాల పత్తిని రూ.5,900-6,500 దాకా వ్యాపారులు ఖరీదు చేశారు. పాత పత్తి విక్రయానికి రాలేదని మార్కెట్ అధికారులు తెలిపారు. సోమవారం కంటే తాజాగా పత్తి ధర రూ.150 తగ్గింది. తేమ అధికంగా ఉండటం, నాణ్యత లేకపోవటంతో ధర తగ్గిందని వ్యాపారులు అంటున్నారు.

మద్దతు ధరపైనే ఆశలు



పత్తి కొనుగోళ్లు ప్రారంభించిన వ్యాపారులు

ఉమ్మడి జిల్లాలో సీజన్‌కు ముందు నుంచే కొత్తపత్తి కొనుగోళ్లు మొదలయ్యాయి. పాత పత్తి విక్రయాలు తగ్గిపోగా.. క్రమేణా కొత్తపత్తి విక్రయాలు పెరుగుతున్నాయి. గత నెల 13 నుంచి జమ్మికుంట ప్రధాన వ్యవసాయ మార్కెట్‌కు కొత్తపత్తిని రైతులు విక్రయానికి తీసుకొస్తున్నారు. వరంగల్, కేసముద్రం, ఖమ్మం మార్కెట్లలోనూ కొత్తపత్తి విక్రయాలు ప్రారంభమయ్యాయి. – న్యూస్‌టుడే, జమ్మికుంట


జమ్మికుంట మార్కెట్ యార్డులో ఆరబెట్టిన కొత్తపత్తి

క్వింటాకు రూ.7,521

■ కేంద్ర ప్రభుత్వం క్వింటా పత్తికి రూ.7,521 మద్దతు ధర ప్రకటించింది. ఇది ఈ నెల 1 నుంచి అమలులోకి రానుంది.

■ పింజ పొడవును బట్టి మధ్యస్థ పత్తికి రూ.7,121గా నిర్ణయించింది.

■ వరంగల్ రీజియన్ మార్కెటింగ్ పరిధిలో నాలుగు వ్యవసాయ మార్కెట్లకు కొత్తపత్తిని రైతులు విక్రయానికి తీసుకొస్తున్నారు.

■ జమ్మికుంటలో కొనుగోళ్ల మొదటి రోజు రూ.7,119ల ధర పలికింది.

■ మార్కెట్‌లో సుమారు 17 రోజుల్లో సుమారు 800 క్వింటాళ్ల కొత్త పత్తి కొనుగోళ్లు జరిగాయి.

■ కొత్తపత్తి విక్రయాలు దసరా అనంతరం జోరు అందుకోనున్నాయి.

■ రానున్న రోజుల్లో ఎక్కువ మొత్తంలో పత్తి విక్రయానికి వచ్చే అవకాశం ఉన్నందున మద్దతు ధర కోల్పోకుండా సీసీఐ కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయడంపై ఉన్నతాధికారులు దృష్టి సారించాలని రైతులు కోరుతున్నారు.

■ ప్రస్తుతం కొత్తపత్తితోపాటు నామమాత్రంగా వస్తున్న పాతపత్తిని ద్వితీయ శ్రేణి వ్యాపారులే ఖరీదు చేస్తున్నారు. అధిక తేమ శాతం, నాణ్యత లేని పత్తిని ఖరీదు చేసి యార్డులో, గిడ్డంగులు, షాపుల వద్ద ఆరబెడుతున్నారు.

■ మహారాష్ట్ర, ఇతర ప్రాంతాల్లో విక్రయించేందుకు వీలుగా తేమశాతం ఎక్కువ ఉన్న పత్తిని ఆరబెట్టడంపై ద్వితీయశ్రేణి వ్యాపారులు దృష్టి సారించారు.

■ ప్రస్తుతం జిన్నింగ్ మిల్లుల్లో యంత్రాల మరమ్మతు పనులు చేపట్టామని.. దసరా తర్వాతే మిల్లుల్లో కొత్తసీజన్‌లో కొనుగోళ్లు చేపడతామని మిల్లుల వ్యాపారులు చెబుతున్నారు.

తేమ లేకుండా చూడాలి



జమ్మికుంట మార్కెట్‌లో కొత్తపత్తి విక్రయాలు క్రమేణా పెరిగాయి. పత్తి ఏరగానే నేరుగా విక్రయానికి తీసుకొస్తున్నారు. దీంతో తేమ శాతం ఎక్కువ ఉంటోంది. ఈ కారణంగా ధర తగ్గుతుంది. రైతులు పత్తిని ఆరబెట్టి పెట్టి విక్రయానికి తీసుకురావాలి. సీసీఐ కొనుగోలు కేంద్రాల ఏర్పాటు నిబంధనలు ఇంకా అధికారుల నుంచి రాలేదు.
- ఆర్.మల్లేశం, కార్యదర్శి, వ్యవసాయ మార్కెట్, జమ్మికుంట

మేమున్నాం.. మీకు తోడుగా... (10 AM TO 1 PM)
వీర్నపల్లి: 91541 18151
బోయినపల్లి: 84999 90001

న్యూస్‌టుడే, వీర్నపల్లి

? వీర్నపల్లి మండలం గర్జనపల్లిలో రోడ్డు విస్తరణ చేపట్టారు. రోడ్డు అంచుల్లో మట్టి పోయలేదు. దీంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. అలాగే ఓ వైపు మురుగు కాలువ లేదు. దీంతో వర్షపు నీరు, మురుగు పారడం లేదు. అధికారులు సమస్యకు పరిష్కారం చూపాలి. - గజ్జెల ప్రశాంత్, గర్జనపల్లి

✓ గర్జనపల్లిలో ఇంకా పనులు పూర్తి కాలేదు. రోడ్డు అంచులో మట్టిని నింపమని గుత్తేదారుకు చెబుతాం.- కిరణ్, ఆర్‌అండ్‌బీ ఏఈ

న్యూస్‌టుడే, రుద్రంగి

? రుద్రంగి మండల కేంద్రంలోని ఆర్‌అండ్‌బీ ప్రధాన రహదారికి అనుసంధానంగా ఉన్న కాలనీల్లోకి వెళ్లే అప్రోచ్ దారులు చెరువు కట్టలను తలపిస్తూ తీవ్ర వాలుగా ఉన్నాయి. వాహనదారులు, పాదచారులు అప్రోచ్ దారుల నుంచి వెళ్లే ప్రమాదాలకు గురవుతున్నారు. అధికారులు స్పందించి సీసీ గానీ, తారు రోడ్డు గానీ వేసి సమస్యను పరిష్కరించాలి. - రాజేశ్, రుద్రంగి

✓ సమస్య మా దృష్టికి వచ్చింది. ఆర్‌అండ్‌బీ శాఖాధికారులు సమస్యను పరిష్కరించకపోతే పంచాయతీరాజ్‌శాఖ తరఫున పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటాం. - మనోహార్, పీఆర్ ఏఈ, రుద్రంగి

అన్నదాతకు పూల పండగ

న్యూస్‌టుడే, కోనరావుపేట

రైతులు సాధారణ పంటలతో పాటు పూల సాగుపై మక్కువ చూపుతున్నారు. ఏడాదంతా బంతిపూలు సాగు చేస్తుండటంతో కుటుంబ సభ్యులతో పాటు ఇతరులకు ఉపాధి కలుగుతుంది. పండగల సమయంలో, శుభకార్యాలకు విక్రయిస్తూ అదనపు ఆదాయం పొందుతున్నారు.

జిల్లాలోని కోనరావుపేట మండలం మంగళ్లపల్లిలో సుమారు 120 కుటుంబాలు ఉన్నాయి. వ్యవసాయాధారిత గ్రామం. పూర్తిగా మెట్టప్రాంతం. నీటి సదుపాయం నామమాత్రమే. పత్తి, మిరప, వరి పంటలను సాగు చేస్తుంటారు. ఇతర గ్రామాల రైతుల మాదిరిగా సాధారణ పంటలతోనే సరిపెట్టకుండా ఏడాదంతా బంతి పూల సాగు చేస్తున్నారు.

● పంట కాల పరిమితి నాలుగు నెలలు కాగా రెండు నెలల పాటు పూల దిగుబడి వస్తోంది.

● ఏడాదికి మూడు సార్లు మొక్కలు నాటుతుంటారు. దీంతో సంవత్సరమంతా పూల సాగు ఉంటుంది.

● గ్రామం నుంచి సాధారణ రోజుల్లో రోజుకు 5 క్వింటాళ్ల మేర, పండగ సమయాల్లో 50 క్వింటాళ్ల వరకు బంతిపూలను వేములవాడ, సిరిసిల్ల, కరీంనగర్ పట్టణాలకు తరలించి విక్రయిస్తుంటారు.

● పూల సాగు ద్వారా వచ్చిన ఆదాయంతో కుటుంబ పోషణ, పిల్లల చదువు, వ్యవసాయ పెట్టుబడులకు వినియోగిస్తుంటామని రైతులు చెబుతున్నారు.


మంగళ్లపల్లిలో బంతిపూల తోట

● ఏడాదంతా కుటుంబ సభ్యులతో పాటు ఇతరులకు ఉపాధి అవకాశం లభిస్తోంది.

రూ.50 వేల ఆదాయం వచ్చే అవకాశం



నాకు రెండు ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. ఎకరంలో పత్తి, అర ఎకరంలో కూరగాయలు, 10 గుంటల్లో వరి, మరో 10 పది గుంటల్లో బంతిపూలు సాగు చేస్తాను. ప్రస్తుతం 5 గుంటల్లో బంతిపూలు విరబూశాయి. బతుకమ్మ, దసరా పండగలకు విక్రయిస్తాను. సుమారు 8 నుంచి 10 క్వింటాళ్ల దిగుబడి వచ్చే అవకాశం ఉంది. గిట్టుబాటు ధర రూ. 50-100 లభిస్తే రూ.50 వేలకు పైగా ఆదాయం వచ్చే అవకాశం ఉంది. దీపావళి, సంక్రాంతి పండగలకు దిగుబడి వచ్చేలా ఇటీవల మరో 5 గుంటల్లో మొక్కలు నాటాను. - **కొమిరెడ్డి దశరథం, రైతు, మంగళ్లపల్లి**

దరఖాస్తుల ఆహ్వానం

సిరిసిల్ల కలెక్టరేట్, న్యూస్‌టుడే: జిల్లాలోని విద్యార్థినులకు ఆత్మరక్షణ విద్యలో శిక్షణ ఇచ్చేందుకు కరాటేలో అనుభవం ఉన్న అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా యువజన, క్రీడలశాఖ అధికారి రాందాస్ ఒక ప్రకటనలో తెలిపారు. కరాటేలో బ్లాక్‌బెల్టు ఉండి, కనీసం రెండేళ్ల శిక్షణ అనుభవంతో పాటు 35 సంవత్సరాలు నిండిన మహిళలు, పురుషులు అర్హులని పేర్కొన్నారు. పూర్తి వివరాలతో ఈ నెల 16లోగా తమ దరఖాస్తులను జిల్లా యువజన, క్రీడల శాఖ కార్యాలయంలో నేరుగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమాన్ని జిల్లాలోని 139 ప్రభుత్వ పాఠశాలల్లో అమలు చేయనున్నట్లు వెల్లడించారు. నెలకు రూ.5 వేల గౌరవ వేతనం ఇస్తారని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు 9440239783, 7569207411 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

రాజన్నను దర్శించుకున్న ప్రముఖులు

వేములవాడ, న్యూస్‌టుడే: ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన వేములవాడలోని శ్రీరాజరాజేశ్వరస్వామిని మంగళవారం సాయంత్రం ప్రముఖులు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్‌కుమార్, రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ సతీమణి మంజుల స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

నిధుల మంజూరుకు కేంద్ర సహాయ మంత్రికి వినతి

వీర్నపల్లి, న్యూస్‌టుడే: వీర్నపల్లి మండలం ఎర్రగడ్డతండాకు చెందిన పలువురు కరీంనగర్‌లో కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌ను మంగళవారం కలిశారు. గ్రామంలో హనుమాన్, లక్ష్మీనర్సింహస్వామి ఆలయాలకు నిధులు మంజూరు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచి జగ్మాల్, నాయకులు శ్రీనివాస్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డిపేట: ఎల్లారెడ్డిపేట మండలం కోరుట్లపేట గ్రామానికి చెందిన రేవంత్ మిత్రమండలి, టీమ్‌రేవంత్ జిల్లా అధ్యక్షుడు గూడ విజయ్‌రెడ్డి హైదరాబాద్‌లోని సచివాలయంలో మంత్రి పొన్నం ప్రభాకర్‌ను మంగళవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంతోపాటు జిల్లా వ్యాప్తంగా నెలకొన్న పలు సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ఆయా అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయించాలని విన్నవించారు.

రైతులు దళారులను ఆశ్రయించి నష్టపోవద్దు

ఎల్లారెడ్డిపేట, న్యూస్‌టుడే: ప్రస్తుతం వరికోతలు ప్రారంభమైన నేపథ్యంలో రైతులు పండించిన ధాన్యాన్ని దళారులకు విక్రయించి, నష్టపోవద్దని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య పేర్కొన్నారు. ఎల్లారెడ్డిపేటలో మంగళవారం ఆయన మాట్లాడుతూ మండలంలో ఈ నెల 15 లోగా కొనుగోలు కేంద్రాలు ప్రారంభమవుతాయని, ప్రభుత్వం గిట్టుబాటు ధర కల్పిస్తుందని తెలిపారు. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయించిన రైతులకు మూడు రోజుల్లోగా డబ్బులు అందించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందని పేర్కొన్నారు. కేంద్రాల్లో సన్నరకం, దొడ్డురకం ధాన్యాన్ని తూకం వేసేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు. సన్నరకం ధాన్యానికి ప్రభుత్వం రూ. 500 బోనస్ చెల్లిస్తుందన్నారు. రైతుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, అన్నదాతల కుటుంబాలు ఆర్థికంగా ఎదిగేందుకు విధివిధానాలను రూపకల్పన చేస్తుందని తెలిపారు. ధాన్యం కొనుగోలు విషయంలో భారాస నాయకులు సృష్టిస్తున్న లేనిపోని అపోహలను రైతులు నమ్మవద్దని పేర్కొన్నారు.

కార్యకర్తల సంక్షేమానికి భారాస కృషి

ఎల్లారెడ్డిపేట, న్యూస్‌టుడే: భారాస కార్యకర్తల సంక్షేమానికి పార్టీ కట్టుబడి ఉందని, దురదృష్టవశాత్తు మరణిస్తే బాధిత కుటుంబాలకు అండగా నిలుస్తోందని భారాస జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య పేర్కొన్నారు. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రానికి చెందిన సందుపట్ల లక్ష్మారెడ్డి, మిరియాల్‌కార్ సాయితో పాటు హరిదాస్‌నగర్ గ్రామానికి చెందిన ప్రమాదవశాత్తు మరణించిన ఎక్కలదేవి మల్లేశం కుటుంబాలకు పార్టీ తరపున రూ. 2 లక్షల చొప్పున మంజూరైన బీమా చెక్కులను జడ్పీటీసీ మాజీ సభ్యుడు చీటి లక్ష్మణ్‌రావు, నాయకులతో కలిసి మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా తోట ఆగయ్య మాట్లాడుతూ పార్టీ కోసం పని చేసే ప్రతి కార్యకర్తను భారాస రాష్ట్ర అధ్యక్షుడు కేసీఆర్, ఎమ్మెల్యే కేటీఆర్ కంటికి రెప్పలా కాపాడుకుంటున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో పార్టీ మండలాధ్యక్షుడు వర్స కృష్ణహరి, పీఏసీఎస్ ఛైర్మన్ కృష్ణారెడ్డి, ఎంపీటీసీ మాజీ సభ్యులు నాగరాణి, అనసూయ, నాయకులు అందె సుభాష్, ఎడ్ల సందీప్, అప్సరున్నీసా, మంజుల కల్యాణ్, బాల్‌రెడ్డి, నర్సింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కాజ్‌వేకు తాత్కాలిక మరమ్మతులు

మామిడిపల్లి (కోనరావుపేట), న్యూస్‌టుడే: కోనరావుపేట మండలం మామిడిపల్లి మూలవాగులోని కాజ్‌వే వర్షాకాలంలో భారీ వర్షాల కారణంగా వచ్చిన వరదకు కోతకు గురై మూడు నెలలుగా రాకపోకలు నిలిచిపోయాయి. దీంతో వాహనదారులు, రైతులు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు.


మామిడిపల్లి మూలవాగులో మరమ్మతు చేసిన కాజ్‌వే

గ్రామస్థులు, నాయకులు సమస్యను వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ దృష్టికి తీసుకెళ్లారు. బతుకమ్మ, దసరా పండగల దృష్ట్యా మూలవాగులో కోతకు గురైన కాజ్‌వేకు మరమ్మతులు చేయించాలని ప్రభుత్వ విప్ గ్రామ మాజీ ఉప సర్పంచి ఎల్లాల రాంరెడ్డికి సూచించారు. ఆయన తన సొంత డబ్బులతో బాగు చేయించటంతో రాకపోకలు సాగుతున్నాయి. దీంతో మండల ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

రుద్రంగి, న్యూస్‌టుడే: రుద్రంగి మండల కేంద్రంలోని శ్రీరాజరాజేశ్వర యువజన సంఘం నూతన కార్యవర్గాన్ని మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా గండి నవీన్, ఉపాధ్యక్షుడిగా గండి నారాయణ, ప్రధాన కార్యదర్శిగా పోగుల మోహన్ ఎన్నికయ్యారు.

ఫొటో తెచ్చేందుకు వెళ్లి మృతి

వీర్నపల్లి, న్యూస్‌టుడే: అన్న కొడుకు ఫొటో తెచ్చేందుకు వెళ్లి హఠాన్మరణం చెందిన ఘటనతో వీర్నపల్లి మండలం సీతారాంనాయక్‌తండాలో మంగళవారం విషాదం నెలకొంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... తండాకు చెందిన బానోతు మోహన్(55) అవివాహితుడు. స్థానికంగా కూలీ పనులు చేస్తూ అన్న లింబాతో కలిసి ఉంటున్నాడు. తన సోదరుడి కుమారుడు తిరుపతి అయిదేళ్ల క్రితం విద్యుదాఘాతంతో మృతి చెందాడు. దసరాకు నివాళులర్పించేందుకు తిరుపతి ఫొటో తీసుకొస్తానని చెప్పి సిరిసిల్లకు బయలుదేరాడు. సిరిసిల్ల గాంధీ విగ్రహానికి సమీపంలో ఒక్కసారిగా కుప్పకూలాడు. స్థానికులు ఆసుపత్రికి తరలించగా అప్పటికే గుండెపోటుతో మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు.


మోహన్‌నాయక్

చోరీ కేసులో ఒకరికి జైలు

వేములవాడ, న్యూస్‌టుడే: చోరీ కేసులో ఒకరికి జైలు శిక్ష విధిస్తూ వేములవాడ కోర్టు జడ్జి జ్యోతిర్మయి మంగళవారం తీర్పు వెల్లడించినట్లు పట్టణ సీఐ వీర ప్రసాద్ తెలిపారు. వేములవాడ పట్టణంలోని కోనాయిపల్లికి చెందిన దుర్గం ప్రవీణ్‌కి చెందిన ద్విచక్ర వాహనాన్ని 2024 ఏప్రిల్‌లో సిద్దిపేట జిల్లా సర్వాయిగుడి మెచిగపల్లి గ్రామానికి చెందిన బానాల గణేశ్ దొంగిలించినట్లు చెప్పారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేసి నిందితుడిని రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. కోర్టులో నేరం రుజువు కావడంతో నిందితుడికి అయిదు నెలల కారాగార శిక్ష విధించినట్లు సీఐ తెలిపారు.

నేర వార్తలు


సిరిసిల్లలో భక్తులకు అన్నదానం


సిరిసిల్ల మార్కండేయ వీధిలో పూజలు


ఎల్లారెడ్డిపేటలో...

దుర్గాదేవికి కుంకుమ పూజలు

శరన్నవరాత్రోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఈ సందర్భంగా దుర్గాదేవికి మంగళవారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు కుంకుమ పూజలు చేశారు. పలుచోట్ల అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో మండపాల నిర్వాహకులు, భక్తులు పాల్గొన్నారు. - **న్యూస్‌టుడే బృందం**


నిమ్మపల్లిలో...


మద్దికుంటలో...


గంభీరావుపేటలో...


చందుర్తిలో చండీయాగం...


రాచర్ల గొల్లపల్లిలో గౌడ సంఘం ఆధ్వర్యంలో...

పెరటి కోళ్ల పెంపకంతో ఉపాధి

వట్టిమల్ల (కోనరావుపేట), న్యూస్‌టుడే: పెరటి కోళ్ల పెంపకంతో స్వశక్తి సభ్యులకు ఉపాధి మెరుగుపడుతుందని డీఆర్డీవో శేషాద్రి పేర్కొన్నారు. కోనరావుపేట మండలం వట్టిమల్లలో పలు గ్రామాల స్వశక్తి సంఘాల మహిళా సభ్యులకు మంగళవారం పెరటి కోళ్లను ఆయన అందజేశారు. మహిళా సంఘాల సభ్యులు ఆర్థికంగా బలపడటానికి ప్రభుత్వం పెరటి కోళ్ల పంపిణీ చేపట్టిందన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని లబ్ధిపొందాలన్నారు. కార్యక్రమంలో అడిషనల్ డీఆర్డీవో శ్రీనివాస్, ఇందిరా మహిళా శక్తి డీపీఎం సుధారాణి, స్త్రీనిధి ఆర్‌ఎం రాంనారాయణ, ఏపీఎం రాకేశ్, సీసీలు జనార్దన్, బాలరాజు, శంకర్, రవి, రేణుక, మహిళా సంఘాల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.


పెరటి కోళ్ల వద్ద డీఆర్డీవో శేషాద్రి లబ్ధిదారులు తదితరులు

నేటి నుంచి వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు

సిరిసిల్ల అర్బన్, న్యూస్‌టుడే: సిరిసిల్ల పట్టణంలోని శ్రీలక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలు ఈ నెల 9 నుంచి 19 వరకు వైభవంగా జరుగుతాయని ఆలయ కార్యనిర్వహణాధికారి మారుతీరావు తెలిపారు. ఇందుకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు పేర్కొన్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.


విద్యుత్తు వెలుగులో ఆలయం

మట్టి తరలింపును అడ్డుకున్న గ్రామస్థులు

వేములవాడ గ్రామీణం, న్యూస్‌టుడే: వేములవాడ గ్రామీణ మండలం మర్రిపల్లి గ్రామ చెరువు నుంచి శ్రీరాజరాజేశ్వరస్వామి గోశాలలో అభివృద్ధి పనులకు మట్టి తరలించడానికి వచ్చిన టిప్పర్లను, యంత్రాలను మంగళవారం గ్రామస్థులు అడ్డుకున్నారు. తాము రెవెన్యూ అధికారుల నుంచి అనుమతి తీసుకున్నామని గుత్తేదారు తెలిపినా వినలేదు. దీంతో వాగ్వాదం జరిగింది. ఆర్డీవో రాజేశ్వర్, తహసీల్దార్ సుజాత చేరుకొని గ్రామస్థులతో మాట్లాడినప్పటికీ వినకపోవడంతో వెనుదిరిగారు.

కొనసాగుతున్న పోలీస్ క్రీడా పోటీలు

సిరిసిల్ల గ్రామీణం, న్యూస్‌టుడే: మానసిక ప్రశాంతత కోసం పోలీస్ సిబ్బందికి నిర్వహిస్తున్న క్రీడా పోటీలు రెండో రోజు మంగళవారం ఉత్సాహంగా కొనసాగాయి. క్రికెట్, క్యారమ్, చదరంగం పోటీలు నిర్వహించారు. విజేతలకు పోటీల ముగింపు సందర్భంగా బహుమతులు ప్రదానం చేయనున్నట్లు ఎస్పీ అఖిల్ మహాజన్ తెలిపారు.



క్యారమ్ ఆడుతున్న పోలీస్ క్రీడాకారులు

నేడు విద్యుత్తు సమస్యల పరిష్కార వేదిక

రుద్రంగి, న్యూస్‌టుడే: సెస్ పరిధిలోని చందుర్తి, రుద్రంగి, బోయినపల్లి, వేములవాడ గ్రామీణం, వేములవాడ అర్బన్, కోనరావుపేట మండలాల పరిధిలోని విద్యుత్తు సమస్యల పరిష్కారానికి చందుర్తి మండల కేంద్రంలో బుధవారం పరిష్కార వేదికను ఏర్పాటు చేసినట్లు సీజీఆర్ఎఫ్-2 నిజామాబాద్ ఛైర్‌పర్సన్ నారాయణ తెలిపారు. ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు నిర్వహిస్తామని ఆయన పేర్కొన్నారు. వినియోగదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

నిరుద్యోగుల పక్షాన పోరాడుతా

సిరిసిల్ల గ్రామీణం, న్యూస్‌టుడే: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో తనను గెలిపిస్తే నిరుద్యోగుల పక్షాన నిలబడి, వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని కరీంనగర్ అల్ఫోర్స్ విద్యా సంస్థల ఛైర్మన్ నరేందర్ రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం సిరిసిల్లలో విలేకరులు, న్యాయవాదులతో వేర్వేరుగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పట్టభద్రులు తప్పకుండా ఓటరుగా నమోదు చేసుకోవాలన్నారు. న్యాయవాదుల సమస్యలు పరిష్కరించడంతో పాటు, వారికి రూ.5 వేల గౌరవ వేతనం వచ్చే విధంగా కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సంజీవరెడ్డి, న్యాయవాదులు, తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న నరేందర్‌రెడ్డి

పోటీ పరీక్షల సన్నద్ధతకు ఉచిత శిక్షణ కేంద్రాలు

వేములవాడ, న్యూస్‌టుడే: నిరుద్యోగ యువతీ, యువకులు పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యేందుకు ఉచిత శిక్షణ కేంద్రాలను ఏర్పాటు చేస్తానని కరీంనగర్ అల్ఫోర్స్ విద్యా సంస్థల ఛైర్మన్ నరేందర్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం ఆయన వేములవాడలోని శ్రీరాజరాజేశ్వరస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. స్వామివారికి కోడె మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం వేములవాడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ నిజామాబాద్, కరీంనగర్, మెదక్, ఆదిలాబాద్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీలో ఉంటానని స్పష్టం చేశారు.

పట్టు వదలకుండా చదివి... ఉద్యోగం సాధించి

వీర్నపల్లి, న్యూస్‌టుడే: వీర్నపల్లి మండలం బంజేరుకు చెందిన కన్నం జనార్దన్ ప్రైవేటు పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పని చేస్తున్నాడు. తల్లిదండ్రులు కన్నం మల్లయ్య, మణెమ్మలు దినసరి కూలీలుగా పని చేస్తూ చదివించారు. 2008 డీఎస్సీలో అన్న గంగయ్య స్కూల్ అసిస్టెంట్‌గా ఎంపిక కాగా, జనార్దన్ అర మార్కుతో ఉద్యోగాన్ని కోల్పోయాడు. అదే సంవత్సరం తండ్రి మల్లయ్య అనారోగ్యంతో మృతి చెందాడు. అప్పటి నుంచి పట్టువదలకుండా డీఎస్సీకి సన్నద్ధమయ్యాడు. ఎస్జీటీగా ఉద్యోగాన్ని సాధించాడు.


కన్నం జనార్దన్

ఫొటోగ్రఫీ, లఘు చిత్రాల పోటీలకు ఆహ్వానం

సిరిసిల్ల గ్రామీణం, న్యూస్‌టుడే: జిల్లాలోని విద్యార్థినీ, విద్యార్థులు, యువత, ఔత్సాహిక ఫొటోగ్రాఫర్లు ఫొటోగ్రఫీ, షార్ట్ ఫిలిమ్ పోటీల్లో పాల్గొనేందుకు ముందుకు రావాలని ఎస్పీ అఖిల్ మహాజన్ ఒక ప్రకటనలో కోరారు. అక్టోబర్ 21న జరిగే పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా పోలీస్ సంబంధిత అంశంపై ఫొటోగ్రఫీ, షార్ట్ ఫిలిమ్ తీయడానికి పోటీలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. పోలీసు త్యాగాలు, పోలీసు విధుల్లో ప్రతిభను తెలిపే విధంగా ఉండే తీసిన 3 ఫొటోలు, 3 నిమిషాల షార్ట్ ఫిలిమ్ తీసి రాష్ట్రస్థాయి పోటీల కోసం ఈ నెల 20లోగా జిల్లా పోలీస్ కార్యాలయంలో పీఆర్వోకు అందజేయాలన్నారు. ఏమైనా సందేహాలు ఉంటే 8712656431 నంబర్‌కు ఫోన్ చేసి నివృత్తి చేసుకోవాలని పేర్కొన్నారు.

అప్పుకట్టాలని పట్టుబట్టిన మైక్రోఫైనాన్స్ సిబ్బంది
ఆందోళనకు దిగిన మహిళలు

తంగళ్లపల్లి, న్యూస్‌టుడే: తంగళ్లపల్లి మండలం కేసీఆర్ నగర్‌కు చెందిన సుమారు 20 మంది మహిళలు మైక్రోఫైనాన్స్ (ప్రైవేటు బ్యాంకు)లో రుణాలు తీసుకున్నారు. పండగ పూట రుణాలు చెల్లించాలని మైక్రోఫైనాన్స్ సిబ్బంది మంగళవారం బాధితులను పట్టుబట్టారు. సమయం ఇవ్వాలని కోరగా ఇప్పుడే కట్టాలని తిష్ఠ వేయడంతో మహిళలు ఆందోళనకు దిగారు. అంతటితో ఆగకుండా ఎల్‌డీఎం మల్లికార్జున్‌కు సమాచారం అందించారు. ఈ విషయం తెలుసుకున్న ఎల్‌డీఎం కేసీఆర్‌నగర్ వచ్చి బ్యాంకు అధికారులతో మాట్లాడి అక్కడి నుంచి పంపించడంతో సమస్య సద్దుమణిగింది.

హెచ్చరిక మరియు బహిరంగ ప్రకటన

ఇందుమూలముగా సమస్త ప్రజలకు తెలియజేయునది ఏమనగా, నా క్లయింట్లు అగు శ్రీ కక్కిరాల రమేశ్, తండ్రి: పుల్లయ్య మరియు శ్రీమతి కక్కిరాల సుజన, భర్త: రమేశ్, నివాసం: కరీంనగర్ గారలు ఈ క్రింది షెడ్యూల్ స్థిరాస్తిని **"అక్షర టౌన్‌షిప్స్ ప్రై. లి.,"** హన్మకొండ అను దాని ఛైర్మన్ శ్రీ శ్రీనివాసరావు పేరాల, తండ్రి: భీంరావు గార్లకి విక్రయించి వారి పేరున రిజిష్టర్ విక్రయ దస్తావేజు నెం. 1109/2018, తేది: 20-02-2018 వ్రాయించి ఇచ్చినారు.

పై కొనుగోలుదార్లు కొంత విక్రయ ధనమును చెల్లించి మిగతా విక్రయ ధనమునకు పోస్టు డేటెడ్ చెక్కులు ఇచ్చినారు. కాని అట్టి చెక్కులకు చెల్లింపులు చేయనందున, నా క్లయింట్లు గౌరవ సీనియర్ సివిల్ జడ్జి, కరీంనగర్ గారి కోర్టులో దావా నెం. ఓ.యస్. 24/2020 గల దానిని **అక్షర టౌన్‌షిప్ ప్రై. లి.** యొక్క ఛైర్మన్ మరియు డైరక్టర్లు 1) శ్రీ పేరాల శ్రీనివాస్‌రావు, తండ్రి: భీంరావు, ఇ.నెం.1-7-1385, గ్రౌండ్‌ఫ్లోర్, అడ్వకేట్ కాలనీ, హన్మకొండ, వరంగల్ జిల్లా, 2) శ్రీ రాజేందర్ పుప్పాల, తండ్రి: చంద్రయ్య, నివాసం: ఇ.నెం. 25-7-26, విష్ణుపురి, కాజిపేట జంక్షన్, హన్మకొండ, వరంగల్ జిల్లా, 3) శ్రీ కొండల్‌రావు సూరినేని, తండ్రి: రాజేశ్వర్‌రావు, నివాసం: ఇ.నెం. 1-99, మొగుల్లపల్లి గ్రామం, పర్కాల్ మండలం, వరంగల్ జిల్లా., 4) శ్రీమతి శ్రీవిద్య పేరాల, భర్త: శ్రీనివాస్‌రావు, నివాసం: ఇ.నెం. 2-10-765, ఎస్.బి.హెచ్. కాలనీ, వడ్డేపల్లి ఎక్స్‌రోడ్, సుబేదారి, వడ్డేపల్లి రూరల్, హన్మకొండ లోకాలిటి, వరంగల్ జిల్లా గార్లపై దాఖలు చేయగా గౌరవ కోర్టు వారు ఈ క్రింది స్థిరాస్థికి అటాచ్‌మెంట్ ఉత్తర్వులను జారీ చేసినారు.

కావున పై కొనుగోలుదారు అయిన **అక్షర టౌన్‌షిప్స్ ప్రై. లి.** మరియు దాని డైరక్టర్లతో ఈ క్రింది స్థిరాస్థిపై ఎలాంటి క్రయ-విక్రయ మరియు తనఖా వంటి ఎలాంటి లావాదేవీలు జరుపరాదని సమస్త ప్రజలను సంస్థలను మరియు వాణిజ్య బ్యాంకులను హెచ్చరించనైనది. ఎలాంటి లావాదేవీలైనా పై దావా కోర్టు యొక్క తీర్పుననుసరించి మాత్రమే హక్కులు సంక్రమించునని తెలియజేయుచున్నాను.

స్థిరాస్తి షెడ్యూలు: కరీంనగర్ జిల్లా, రామడుగు మండలం, వెలిచాల గ్రామ శివారులోని భూములు రక్బా ఎ.3-29 గుంటలు, సర్వే నెం. 132 మరియు 133/ఎ లలో భూమికి హద్దులు: తూర్పు: సర్వే నెం. 133 పార్ట్‌లోని భూమి **అక్షర టౌన్‌షిప్ ప్రై. లి.,** పడమర: సర్వే నెం. 132 పార్ట్ లోని భూమి, ఉత్తరం: సర్వే నెం. 132 పార్ట్ లోని భూమి, దక్షిణం: సర్వే నెం. 131 పార్ట్ లోని భూమి & సర్వే నెం. 134 పార్ట్ లోని భూమి.

తేది: 08-10-2024 సం/-, **ఏగిన శ్రీనివాస్,** అడ్వకేట్, కరీంనగర్ - 505001
సప్తగిరి, ఇ.నెం. 3-7-272/2, వావిలాలపల్లి, కరీంనగర్. సెల్: 98490 72875


వరదవెల్లిలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు


మాన్వాడలో...


సిరిసిల్లలో పుర ఛైర్‌పర్సన్ కళ తదితరులు

ఒక్కేసి పువ్వేసి చందమామ..

బతుకమ్మ వేడుకలు మంగళవారం ప్రజలు ఘనంగా నిర్వహించుకున్నారు. ఉదయం నుంచి మహిళలు, చిన్నారులు వివిధ రకాల పూలను సేకరించారు. తంగేడు, గునుగు, గుమ్మడి తదితర పూలతో బతుకమ్మలను అందంగా పేర్చారు. అనంతరం గ్రామాల్లోని ప్రధాన వీధులు, ఆలయాల్లో బతుకమ్మలను నిలిపి ఆడి పాడారు. - **న్యూస్‌టుడే బృందం**


వట్టెంలలో...


అనుపురంలో ...


17వ బెటాలియన్‌లో ...


వేములవాడ గ్రామీణంలో...